క్లుప్తంగా

స్వాతిగౌడ్‌కు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సన్మానం



మంగళగిరి: పట్టణానికి చెందిన విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ స్వాతి గౌడ్‌ను మంగళవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా మీ కోసం కార్యక్రమంలో భాగంగా విజయ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి స్వాతి గౌడ్‌ను కలెక్టర్ జి.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వాతి గౌడ్ మాట్లాడుతూ పేదవారికి సేవ చేయడంలో విజయ హెల్త్ ఎన్నడూ ముందుంటుందన్నారు. పేద ప్రజలకు సేవ చేయడమే విజయ హెల్త్ కేర్ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడేపల్లిరూరల్: రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తాము పండించిన పంటలను అమ్ముకోవాలని సూచించారు. దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీనా, జానకి దేవి, తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీఓ ఎ.శ్రీనివారావు, రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని సెంట్రింగ్ మేస్త్రి మృతి



మంగళగిరి: నగర పరిధిలోని తెనాలి రోడ్డులో మంగళవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. సెంట్రింగ్ మేస్త్రిగా పనిచేసే షేక్ నాగుల్‌మీరా (45) మంగళవారం పని ముగించుకుని మంగళగిరి నుంచి దుగ్గిరాల మండలం చిలువూరు తన స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆత్మకూరు వద్ద వెనుకనుంచి లారీ ఢీకొట్టింది. ఘటనలో నాగుల్‌మీరా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి ..

తాడికొండ: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు ఏటీ అగ్రహారంకు చెందిన పంగలూరి హరికిషన్(52) అతని స్నేహితుడు నేతగాని విజయ్ కుమార్‌తో కలిసి బైక్‌పై అమరావతి నుంచి గుంటూరు వైపునకు వెళుతుండగా నిడుముక్కల శివారు ఉన్న కళాజ్యోతి పేపరు మిల్లు ఎదుటకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న పంగలూరి హరికిషన్ బైకుపై నుంచి కిందపడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సమాచారం సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఏసీసీ' కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని తాడేపల్లి సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం మానవహారంగా ఏర్పడి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తక్షణమే యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలన్నారు. నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, ఎం.ఆశీర్వాదం, సాంబయ్య, శారద, సారమ్మ, దుర్గ భవాని, దానయ్య, జోజి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ, పొక్లెయిన్ సీజ్

టీడీపీ నేతకు చెందిన వాహనాలు కావడంతో కేసు నమోదు చేయని పోలీసులు

తాడికొండ: తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో సోమవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా ఇసుక డంప్‌ను తరలించేందుకు లోడింగ్ చేస్తున్న ఓ ఇసుక లారీ, పొక్లెయిన్‌ను తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాలు టీడీపీకి చెందిన నాయకుడివి కావడంతో స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. దొండపాడులో అక్రమంగా ఇసుకను డంప్ చేసి రాత్రిళ్లు గుట్టు చప్పుడు కాకుండా విజయవాడకు తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

ఏయ్..బిడ్డా.. ఇది మా అడ్డా!

- మందుబాబుల అడ్డాలుగా ఉండవల్లి యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ వెంబడి పొలాలు
- ఆడమగ తేడాలేకుండా మద్యం మత్తులో నిత్యం ఘర్షణలు
- తాగిన సీసాలను పగలకొట్టి పంటపొలాల్లోకి గిరాటు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు
- పట్టించుకోని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు



ఉండవల్లి సెంటర్ బస్టాండ్ వెనుక పార్కులో మద్యం తాగుతున్న మందుబాబులు



అరటితోటలో పడవేసిన మద్యం సీసాలు



పగలకొట్టిన మద్యం సీసా పెంకులను చూపిస్తున్న రైతు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గవ్యాప్తంగా గత కొంతకాలం నుంచి బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులు హల్‌చల్ చేస్తూ పంటపొలాల్లో తాగిన సీసాలను విసిరివేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉండవల్లి యూటీకే లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ వెంబడి రైతులు ఏర్పాటు చేసుకున్న పంపు షెడ్ల వద్ద మందుబాబులు, భామలు మద్యం సేవించి మాటా మాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారు. ఐదు రోజుల క్రితం ఉండవల్లి ఆంజనేయస్వామి దేవస్థానం, ఉండవల్లి దళితవాడ కట్ట మధ్యలో ఉన్న పంప్ హౌస్ వద్ద మద్యం సేవించి ఆడమగ తేడా లేకుండా ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడంతో ఒక మహిళకు తీవ్రగాయాలయ్యాయి. పంట కాలువ నీటిలో, ఒడ్డున ఎక్కడ చూసినా మద్యం సీసాలు, గాజు పెంకులు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు కనిపిస్తున్నారు. ప్రతిరోజు శుభ్రం చేసుకున్నా మరునాడు అదేవిధంగా సీసాలు, ఇతర వ్యర్థాలు వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హల్‌చల్‌తో బెంబేలు..

అమ్మ హోటల్ పక్కనే ప్రతిరోజు తెల్లవారుజామున మహిళలతో పాటు పలువురు వాకింగ్ చేసేందుకు వస్తూ ఉంటారు. ఆ రహదారిలో కూడా పంటపొలాల్లో మద్యం తాగి ఆ సీసాలను ఆ రోడ్డుపై పడవేయడంతో వాకింగ్ చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లి వెళ్లే రహదారిలో ఉన్న పార్కులో మందుబాబులు మద్యం తాగి సీసాలు, గ్లాసులు అక్కడే పడేస్తున్నారు. అక్కడే తాడేపల్లి ఊర్లోకి వెళ్లేందుకు బస్టాండ్‌తో పాటు ఆటోస్టాండ్ కూడా ఉంది. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉన్న సమయంలో మందుబాబులు మద్యం సేవిస్తూ నానారకాలుగా దుర్భాషలు ఆడుకుంటుండడంతో మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.

మేల్కోకపోతే మరిన్ని అనర్థాలు..!

ఎన్‌టీఆర్ కరకట్ట నుంచి మణిపాల్ హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలోను, పాత టోల్‌గేట్ ఎదురుగా వున్న రహదారిలో, వడ్డేశ్వరం కొలను కొండ, గుంటూరు చానల్ ఒడ్డున, రేవేంద్రపాడు బకింగ్‌హామ్ కెనాల్ లాకుల వద్ద, దుగ్గిరాలలోని పలు కాలువల వద్ద, డొంకరోడ్లలో, మంగళగిరిలోని పలు డొంక రోడ్లలో మందుబాబులు తాగి సీసాలు పగలకొట్టడంతో రైతులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసులు బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో అనర్థాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో మందు తాగేవారిని మందలిస్తే తమపై దాడిచేసేందుకు కూడా వెనుకాడడం లేదని రైతులు వాపోతున్నారు.

పొలానికి వెళ్లాలంటే భయమేస్తోంది



ఉదయం, సాయంత్రం తేడా లేకుండా మందుబాబులు మద్యం తీసుకువచ్చి పంటపొలాల్లో తాగుతున్నారు. ఇక్కడ తాగుతున్నారేంటని ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడుతున్నారు. ఈ మధ్యకాలంలో 112కు కాల్ చేసి సమాచారం ఇచ్చాం. ఇదిగో పంపిస్తున్నామన్నారు కానీ ఎవరూ రాలేదు. ఒక్కోసారి మద్యం ఎక్కువై వారిలో వారు కొట్టుకుంటున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే పోలీసులు సంబంధిత రైతులనే ప్రశ్నిస్తారు. ప్రభుత్వమే బహిరంగ మద్యాన్ని నిషేధించాలి.

– నందు శ్రీనివాసరావు, రైతు

ప్రశాంతంగా వాకింగ్ చేయలేకపోతున్నాం



ఎక్కడ డొంక రోడ్లలో వాకింగ్ చేద్దామన్నా కుదరడం లేదు. ఏ రోడ్డులో చూసినా మద్యం సీసాలు, గాజు పెంకులు, ఆహార పదార్థాల ప్యాకెట్లే దర్శనమిస్తున్నాయి. ప్రశాంతంగా ఉండే పంట పొలాల్లో మద్యం బాబుల ఆగడాలు ఇటీవల ఎక్కువ అవుతున్నాయి. మందు బాబుల వల్ల రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి పొలంలో గాజు పెంకులు రైతుల కాళ్లలో దిగి ఇబ్బంది పడుతున్నారు. బహిరంగ మద్యాన్ని వెంటనే నిషేధించాలి.

– ఓలేటి నగేష్, తాడేపల్లి

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే సహించేదే లేదు. ఎవరైనా తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే మందు బాబులపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు ముందుకు వచ్చి అలాంటి వారిపై ఫిర్యాదు చేయాలి. ఎక్కడో పంట పొలాల్లో మద్యం సేవించి గొడవలు చేస్తుంటే పోలీసులకు తెలియదు. ప్రజలే సహకరించి సమాచారం ఇస్తే మద్యంబాబులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ముందు సున్నితంగా చెప్పి అనంతరం కేసులు నమోదు చేస్తాం.

– కళ్యాణ్ రాజు, తాడేపల్లి సీఐ

పచ్చనేతల గ్రావెల్ దందా

రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తరలించి అమ్మకాలు



లాంలో కొండను చదును చేస్తూ మట్టి తవ్వకాలు

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో పేదలు నిర్మించుకున్న ఇళ్లను అడ్డగోలుగా కూల్చేసి కడుపు మంట తీర్చుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు.. వారు మాత్రం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ దందాను కొనసాగిస్తూ దొరికినంత దోచుకో అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో అక్రమ స్థలాల దందా ఎల్లలు దాటుతుంది. ఇప్పటికే లాం– తాతిరెడ్డిపాలెం రెండు కొండల నడుమ ఉన్న స్థలాలు పూర్తిగా ఆక్రమణలకు గురికాగా టీడీపీ నాయకులు తమదైన శైలిలో రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా దోపిడీకి తెరలేపారు. గత వారం రోజులుగా కొండపై ఉన్న గ్రావెల్‌ను పొక్లెయిన్లతో తొలగించి గ్రావెల్‌ను రాత్రిళ్లు అమ్ముకుంటూ జేబులు నింపుకొంటున్నారు. ఇంతా తంతు జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. టీడీపీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు కుటుంబ సభ్యుల ఇంటికి ఆనుకొని ఉన్న గ్రావెల్‌ను తరలించడంతో పాటు బ్లాస్టింగ్ చేసి కొండ రాళ్ళను కూడా మెషిన్లతో కటింగ్ చేసి రాళ్లుగా మలిచి అమ్ముకుంటున్నారు. చదును చేసిన ప్రాంతాన్ని ప్లాట్లుగా మలిచి అమ్ముకొనేందుకు కూడా ఇప్పటికే బేరసారాలు మొదలు పెట్టినట్లు సమాచారం. సంబంధిత రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు ఇకనైనా దృష్టి సారించి అక్రమ గ్రావెల్ దందాకు అడ్డుకట్ట వేసి విలువైన సంపద కాపాడాలని పలువురు కోరుతున్నారు.



రాత్రిళ్లు గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

మంగళగిరి: 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఆలీంబాషా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.శకుంతల, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్, కార్పొరేషన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ యాక్ట్స్ ఆధ్వర్యంలో...

75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్స్ పరిరక్షణ ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కారుమంచి రామారావు, మాలపాటి సురేంద్రబాబు, గరికముక్కు డేవిడ్, బూసి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

దొండపాడులో....

తాడికొండ: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తుళ్ళూరు మండలం దొండపాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వనమా డైమండ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, వివిధ విభాగాల నాయకులు కొప్పుల శేషగిరిరావు, డీజే శ్రీనివాసరావు, ఆరేపల్లి జోజి, నాయుడు నాగేశ్వరరావు, బెజ్జం రాంబాబు, జొన్నకూటి ప్రశాంత్, షేక్ జానీ, తంబి, ఆరోగ్యం పాల్గొన్నారు.



ఎంటీఎంసీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ ఆలీంబాషా తదితరులు

- తాడికొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఎంపీడీవో సమతా వాణి పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో ప్రమాణం చేయించారు.
- తాడికొండ పోలీస్ స్టేషన్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సీఐ కె.వాసు ఆధ్వర్యంలో నిర్మాణ కమిటీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
- తాడికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ తోకల సరోజినీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సిబ్బంది, వార్డు మెంబర్లతో ప్రమాణం చేయించారు.



ఫిరంగిపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ, శివరామిరెడ్డి

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: 75వ భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని శాంతిపేటవద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం అందిస్తూ రూపొందించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని చెప్పారు. అదేవిధంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలకు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సిబ్బంది పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమరయోధుల చిత్రాల ప్రదర్శన...

ఫిరంగిపురం: సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర ప్రదర్శన మంగళవారం ఏర్పాటుచేశారు. విద్యార్థులకు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు.

మేడికొండూరులో...

మేడికొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ టి.చందన భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. ఏఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ పూర్ణశంకర్‌రావు, ఏపీఓ కిరణ్మయి, సీనియర్ అసిస్టెంట్ రాజకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచంలోనే గొప్పది భారత రాజ్యాంగం

తాడికొండ: దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలతో రూపొందించిన సమోన్నత రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ పోలీస్‌స్టేషన్ కూడలిలోని బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విభిన్న మతాలు, కులాలు, ప్రాంతాలకు చెందిన కోట్లాది మంది ప్రజలను 75 సంవత్సరాల పాటు ఏకతాటిపై నడిపించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు ఆనంద్, దూసరి డేవిడ్, బెజ్జం సాయి ప్రసాద్, తోకల నరసింహారావు, మట్టుకొయ్య శ్యామ్యూల్, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రాజు, బాకి వెంకట స్వామి, కర్రి రవిపాల్, గద్దె రూబేన్, దమ్మాటి మోహనరావు, ఉండవల్లి నరసింహారావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, జగన్, విశ్రాంత ఏఎస్ఐ టి.పోలరాజు, చందు, రాజేష్, మిక్కిలి కిరణ్, పి.దేవరాజు, ఎం.అశోక్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, విగ్రహ కమిటీ సభ్యులు

అంతర పంటలతో అధిక లాభాలు

ఫిరంగిపురం: పత్తిలో అంతర పంటలుగా చిక్కుడు, టమోటా, ఉల్లి, వంగ వంటి అంతరపంటలు వేయడం ద్వారా అధికంగా లాభాలు పొందవచ్చని ఎన్ఎఫ్ఏ(నేచురల్ ఫామింగ్ అసోసియేట్)టీం సభ్యుడు సతీష్ అన్నారు. మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు, హౌస్‌గణేష్ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను గురించి తెలంగాణ రాష్ట్రం నల్గొండ, వరంగల్ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు వివరించారు. ఈసంతర్భంగా సతీష్ మాట్లాడుతూ స్థానిక రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేశారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువగా చేకూరుతుందని వివరించారు. జిల్లా వైఆర్ఎఫ్ టీం సభ్యులు మంజీరా, ఈశ్వరరెడ్డి, జిల్లా ఎన్ఎఫ్ఏ సభ్యులు ఝాన్సీ, చింతా వరప్రసాద్, నాగరాజు, మోడల్ మేకర్లు ఇర్ల వెంకటేశ్వర్లు, ఎం.అన్నామణి, రామకృష్ణ, తిరుపతిరావు, అమల, ఆరుద్ర నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

GENERAL NOTICE

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) :: GUNTUR

I.P No: 50 / 2024

BETWEEN :
Bhimireddy Sai Swaroop Reddy, S/o. Veera Reddy, R/o. Sri Sathya Sai Samthi Soudha, Z.P. Compound, Nagarampalem, Guntur-522 004. .....Petitioner

and

1)Bhimireddy Srinivasa Reddy, S/o.Rami Reddy, R/o.Door No.4-92, Nutakki(V), Mangalagiri(Md),Guntur Dt., 2) Medikonduru Srinivasa Satya Sai Prasanth, S/o.Ravi Sankar, R/o.Door No.3-136, Motupallivari Street, Backside of Bhaskar Theatre, Railpet, Guntur Town and Dt., 3)Thamma Sivamma, W/o. Venkata Reddy, R/o.Annapareddy Ramalayam Street, Nutakki(V), Mangalagiri(Md),Guntur Dt., 4) Thiyyagura Nagi Reddy,S/o.Jagapathi Reddy,R/o.Gudibandivaripalem (V), Kollipara(Md), Guntur Dt. 5) The Official Receiver, Dist. Court Complex, Guntur. ....Respondents

పై నెంబరు ఐ.పి.లోని పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్‌చేయుమని కోరుచూ దాఖలుచేసిన పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉన్నచో తెలుపుకొనవలసినదిగా కోరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం ది.16-12-2024కి వాయిదావేసినారు. కావున అక్షేపణలు ఉన్న వారు వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకుగల అక్షేపణలు తెలుపుకొనగలరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
వాయిదా తేది :16-12-2024

గాదె ఎరుకల రెడ్డి, పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9848349516

కూటమి పాలనలో రాజ్యాంగానికి తూట్లు

మంగళగిరి: ప్రస్తుతం రాష్ట్రంలో రాజ్యాంగానికి తూట్లు పొడిచేవిధంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) ధ్వజమెత్తారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట పార్టీ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగానికి తూట్లు పొడవడంతో పాటు ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగానికి తూట్లు పొడుతున్న కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు తిరగబడాల్సిన అవసరముందన్నారు. కూటమి ప్రభుతాన్ని ప్రశ్నిస్తే ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి రాష్ట్రమంతా కేసులు పెట్టించి సొంత రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఘనత చంద్రబాబుదన్నారు. తాను ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక తనను ప్రశ్నిస్తారనే భయంతో పోలీసులతో కేసులు పెట్టించి ఇబ్బంది పెడుతున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలంతా ముక్త కంఠంతో వ్యతిరేకించాలన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రజలందరినీ సమానంగా చూసే విధంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే దానిని తుంగలో తొక్కేవిధంగా పరిపాలన కొనసాగడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సావాన్ని పండుగలా నిర్వహించడం అభినందనీయమన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, కుంచర్ల కిషోర్, రాజ్యలక్ష్మి, దొడ్డక కృష్ణ, తాడిబోయిన సురేష్, బేతపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంత్రి లోకేష్‌కు చేనేత సంఘం నేతల వినతిపత్రం



తాడేపల్లిరూరల్: చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో చేనేత కార్మికులు, సహకార సంఘాల నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావలసిన రూ.172 కోట్ల బకాయిలు రాకపోవడంతో ఆయా సహకార సంఘాలు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలక వర్గ ఎన్నికలు నిర్వహించాలన్నారు. 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, చేనేత నేస్తాన్ని రూ. 24 వేల నుంచి రూ.36 వేలకు పెంచి మగ్గం నేసే ప్రతి కార్మికుడితో పాటు చేనేత ఉప వృత్తుల వారికి వర్తింపజేయాలని, చేనేతపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశామని తెలిపారు. తమ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. లోకేష్‌ను కలసిన వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడుపు కన్నయ్య, సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, మాజీ అధ్యక్షుడు కట్టా హేమ సుందరరావు, మంగళగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, రాష్ట్ర సమితి నాయకులు ఉన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com